

కథా కౌముది

# ఏమోయ్ నీకు పెళ్ళైందా!? చంద్రమౌళి కళ్యాణచక్రవర్తి

" ఏమోయ్ నీకు పెళ్లి అయ్యిందా ?? " అడిగేశాను అవును అడిగేశాను , మనస్సు ఉగ్గ బట్టుకోలేక అడిగేశాను .

అదిగో అతనినే. అతను ఆరడుగులకు అటో ఇటో ఉంటాడు , అటు కాదులెండి ఇటే. ఆరుకు ఒకటో రెండో ఇంచులు తక్కువే ఉంటాడు . మీడియం సైజు శరీరం అంటే మరీ లావు కాదు అట్లా అని సన్నం అనీ చెప్పలేము . కొంచం చామనఛాయ. అంటే నలుపు అని మాత్రం అస్సలు అనలేము. తెలుపు అనీ పూర్తిగా ఒప్పుకోలేము. టిప్ టాప్గా తయారయ్యి ఉన్నాడు. నిండు నీలం రంగు ప్యాంటు , దానికి పోటీగా గంధం రంగు చొక్కా శాటిన్ మోడల్ అనుకుంట చక్కగా ఇస్త్రీ చేసి ఫుల్ హ్యాండ్స్ గుండీలు పెట్టుకొని మరీ ఉన్నాడు . అంటే డార్క్ ప్యాంటు లైట్ కలర్ షర్టు వేసుకోవాలీ అని మా కంపనీ డ్రెస్ కోడ్ కాబట్టి వేసుకొచ్చినట్టు అర్థం అయితోంది. నల్లటి బూట్లు అంబాసిడర్ బ్రాండ్ అనుకుంటా చక్కగా పోలిష్ చేసి నిగ నిగ లాడుతున్నాయి. జుట్టు దువ్వుకున్నట్టు తెలుస్తోంది అయితే యవ్వనపు నిర్లక్ష్యపు ముంగురులు ఓ రెండు నుదుటి మీద విలాసంగా నిల్చున్నాయి.

నేను పనిచేసేది భారత దేశం లో ఉన్న అతి పెద్ద కంపెనీలలో ఒక కంపెనీ ( అది ఏ కంపెనీ అయితే మీకు ఎందుకు ?, కథలోకి రండి ). నేను అతను వేరే వేరే డిపార్టుమెంటు కాక పోతే అతని బాస్ కి నాకు దోస్తి ఎక్కువ . ఒకరికొకరం భుజాల మీద తల పెట్టుకుని ఏడ్చేంత స్నేహం.రోజూ లాగానే ఈ రోజు లంచ్ బ్రేక్ లో ఒక కప్పు అల్లం టీ తాగి ఒక దమ్ము తీసి వద్దామని బయలుదేరితే ఇదిగో వాళ్ళ బాస్ ని కలవడం కోసం ఇలా కిందకు వచ్చాడు.

మేము సాధారణంగా మా పధ్నాలుగో అంతస్తు లోంచి లిఫ్ట్ ఎక్కి గ్రౌండ్ ఫ్లోర్ కి వచ్చి బిల్డింగ్ చుట్టూ ప్రదక్షిణగా తిరిగి బిల్డింగ్ వెనక వైపు కొత్తగా కడుతున్న ఇంకొక బిల్డింగ్ ముందు, అక్కడి వాచ్మెన్ వాళ్ళు పెట్టిన చిన్న టీ బంక్ లాంటి చోట , అల్లం చాయ్ కాయించుకుని తాగటం మా అలవాటు. ఆ ఏ సి రూమ్ లు హడావిడి నుంచీ ఒక పది పదిహేను నిముషాలు బయటి ప్రపంచం చూడక పోతే మాకు తోచదు, అంటే ఈ పది పదిహేను నిముషాలు ఫోన్ లు పని చేస్తూనే ఉంటాయి అది వేరే విషయం. అయిదు అంకెల జీతం ఇహనో ఇప్పుడో ఆరు అంకెలు చేరబోతున్న

ఉద్యోగాలు మావి. నేను నా స్నేహితుడు ఇద్దరం గత పదిహేను సంవత్సరాలనుంచి ఇటుకా ఇటుకా పేర్చి ఈ కంపనీ నీ ఈ ఊరులో ఇంత స్థాయికి తీసుకొచ్చామని మనస్సులో ఉన్నా మా పై బాసు లు ఇంక్రిమెంట్ లు ప్రమోషన్ విషయాలలో కాస్త ఆలోచిస్తారు అన్న గుడ్డి నమ్మకంతో, మీటింగ్ ల లో మాత్రం ఇంకా పైకి తేవాలని. ఇంకా చాలా చెయ్యాలీ అంటూ హడావిడి పడిపోతూ ఉంటాము. సర్లేండి మా గొడవ ఎప్పుడూ ఉండేదే , అసలు ఏం అయింది అంటే " ఏమోయ్ నీకు పెళ్ళిఅయిందా?" అని అడిగేశాను అని చెప్పాను కదా . ఆ రోజు రోజూలాగానే నేను నా స్నేహితుడు బయటికి వచ్చాము ఒక కప్పు టీ తాగి తాగి ప్రపంచాన్ని ఒక్క సారి చూసేసి మళ్ళీ మా బాధ్యతల వైపు అడుగెయ్యాలి కదా అని . మావాడి కి ఫోను వచ్చింది

" ఆ ఇప్పుడే అయ్యింది ......"

"........................................................................................................................................ "

" సరే చూస్తాలే .."

"................................................................................................"

" చె...ప్పా ....వు .....కదా చూస్తాలే ........"

"..........................................................................................,.......................... , ................................................."

" సరే బయటికి వచ్చాను .... చూస్తా లే ..."

"..................................( ఏవో మాటలు నడుస్తూ-----------------స్తూ-------------. ఉన్నాయి ).

ఆ టీ బంకు అమ్మాయి టీ ఇచ్చింది , నేనొక గ్లాస్ తీసుకొని ఇంకోటి మావాడికి అందించాను, ఫోన్ ఒక చెవిలో పెట్టుకుని వింటూ గ్లాస్ అందుకున్నాడు .అటూ ఇటూ నడుస్తూ వింటున్నాడు నా వైపు ఒక చూపు కూడా చూశాడు . నేనేమో ఫ్రెష్ గా పెట్టిన అల్లం టీ ని అనుభవించే ఆనందం లో ఉన్నాను . అదిగో అప్పుడే వచ్చాడు అతను . ' హలో ' అంటూ పరిచయం చేసుకొన్నాడు. మావాడు ఫోన్ లో వున్నాడు , రొజూ కంటే ఇవాళ కొంచెం ఎక్కువ సేపే ఫోన్ సం'భాషణ' నడుస్తోంది . టీ తీసుకోమన్నాను అతనిని.

' ఇంకో టీ ఇయ్యమ్మా ' అంటూ టీ బంకు ఆమెకి చెప్పాను .

' అట్లనే సార్ ' అంటూ ఆమే ఇంకొక గ్లాస్ లో ఇవ్వబోయింది ,

' పేపర్ కప్ లేదామ్మా? ' అంటూ అడిగాడు ,

' లేదు సారూ గ్లాస్ బాగా కడిగినా సారూ " అంటూ వినయం గా చెప్పింది

" పేపర్ కప్పు లేక పోతే టీ వద్దు లేమ్మా ...." అన్నాడు,

" గ్లాస్ లు క్లీన్ గా నే కడుగుతారు .... వేడి నీళ్ళలో ఇంకొక్క సారి కడుగమ్మా ఈ సార్ కోసం ...." పెద్దరికం గా చెప్పాను .

" ఒద్దులెండి సర్ అక్కర్లేని రిస్క్ ..." అంటూ తిరస్కరించాడు. అయ్యో ఒక బేరం పోయిందే అని టీ బంకు ఆమె అనుకుంటుందేమో అని అనుకుని సంఘ సంస్కర్తనైన నేను

" టీ బాగుంది ఆ గ్లాస్ నాకియ్యమ్మా " అని మళ్ళీ ఇంకో టీ తీసుకొన్నా .

అవతల మా స్నేహితుడి సంభాషణ తేగేతట్లు కనిపించడం లేదు ఇప్పటికి దాదాపు మాటలు ఒక పావు కిలోమీటర్ నడకను పూర్తి చేసుకొని ఉంటాయి. టీ సిప్ చేస్తూ ఇతని వైపు చూసాను , ఒక విచిత్రమైన చూపు కనిపించింది . ఆ చూపు నిజంగా కనిపించిందో లేక నాకు అనిపించిందో అర్ధం కాలేదు. ఏదైతేనేమి నేను నా రెండో టీ పూర్తి చేశాను మావాడు సంభాషణ పూర్తి చేశాడు. టీ గ్లాస్ టేబుల్ మీద పెట్టి సిగరెట్ అందుకొన్నాడు. ఆవేశం , ఆక్రోశం . అందోళనఅన్నీ సిగరెట్ వెలిగించడం లో స్పష్టంగా కనిపించాయి. లైటర్ నలిగి పోతోంది . టీ బంకు ఆమే అందోళన నాకు అర్ధం అవుతోంది. ' ఏది గురూ లైటర్ " అంటూ మావాడి చేతిలోంచి లైటర్ అందుకుని టేబుల్ మీద పెట్టా. " ఇంకో టీ తాగుతావా " అనునయంగా అడిగా , " ఒద్దులే ...." అన్యమనస్కంగా అనేశాడు.

మళ్ళా ఫోన్ మ్రోగింది నెంబర్ కూడా చూడలేదు కట్ చేశాడు. నాకు తెలుసు ఆ ఫోన్ ఎక్కడినుంచో . నేను మెల్లిగా లేచి రెండు అడుగులు వేశాను టీ బంక్ ఆమెకి డబ్బులు ఇద్దాం అని. జేబులోంచి రెడీ గా పెట్టుకున్న వంద రూపాయల నోటు తీసి ఇచ్చారు చిల్లర తీసుకొన్నాను. మా వాడు సిగరెట్ అంతు చూస్తున్నాడు. ఇంతలో మన కథా నాయకుడు మొదలు పెట్టాడు.

" రోజూ ఇక్కడికి వస్తారా సర్ ...?" మాట కలుపుదాం అన్న ఉత్సాహం కనిపించింది. బాస్ లను మంచి చేసుకోవటం సర్వ సాధారణం కదా. పై ఎత్తు మన కథా నాయకునికి మావాడు రిపోర్టింగ్ బాస్ .

" రోజూ ఏమి కాదు వీలైనప్పుడు ...." మా వాడు అబద్ధం ఆడేశాడు ..." అవును నువ్వు ఇవాళ క్లయింట్ విజిట్ కి వేళ్తానన్నావు గా ఇంకా ఇక్కడ ఏమి చేస్తున్నావు ..." వదిలించుకొని పంపించేయ్యాలన్న తపన కనిపించింది.

" అదే మీకు చెప్పి వెళ్దాం అని ......" ఏదో అడగాలి అన్న కోరిక కనిపించింది ....( మా వాడికీ అనిపించి ఉండొచ్చు. కాని బాస్ కదా బయట పద కూడదు .... ఇది అప్రకటిత వ్యూహం )

" తొందరగా వెళ్ళు ..... మళ్ళా వచ్చి రేపటికి రిపోర్ట్ పంపించక పోతే బిగ్ బాస్ తల తింటాడు ......" ( నాకు అర్ధం అవుతోంది మా వాడిని తల తింటున్న బిగ్ బాస్ ఎవరో ......)

" అదే సార్ అది చెబ్దాం అనే వచ్చాను . ఇక్కడినుంచి చందానగర్ వెళ్లి ... మళ్లీ ఇక్కడికి రావడం ఎందుకు .... అటునించి అటు ఇంటికి వెళతాను సార్ ...." అంటూ గారాలు పోయాడు ...( పిచ్చి వెధవ సమయం సందర్భం ఉండొద్దు గారాబం పోవటానికి ....)

" అట్లా యెట్లా మళ్ళా రిపోర్ట్ యెట్లా చేస్తావు? ఎప్పుడు పంపిస్తావు? .... ఈ ఆఫీసులో ఏ రోజు పని ఆ రోజే పంపియ్యాలి మళ్ళా రేపటికి రేపటి పని ఉంటుంది కదా ..." నచ్చ చెప్పే ఉద్దేశ్యం మా వాడిది

" అది కాదు సార్ అక్కడికి చేరే సరికి నాలుగు అవుతుంది , మీటింగ్ ప్రెజంటేషన్ అయిపోయే సరికి ఈజీ గా అయిదున్నర అవుతుంది మళ్ళా ఆఫీస్ కి రావాలంటే ఏడో ఏడున్నరో అవుతుంది కదా సార్ ........." ( లాజిక్ లు మాట్లాడుతున్నాడు లాజిక్కులు ...) ఎంతో వినయం గా నే అడుగుతున్నాడు

" చూడు బాబు మనది గవర్నమెంట్ ఆఫీస్ ఏమీ కాదు .....పని అయిన తరువాతే ఇంటికి వెళ్ళాలి రాత్రి పన్నెండు అయినా ఒంటి గంట అయినా ...." ( నాకు మావాడి కసి తెలుస్తూనే ఉంది )

" సార్ ఇది కంటిన్యువస్ గా నాలుగో రోజు సార్ , నాకు రోజూ ఇంటికి వెళ్ళే సరికి తొమ్మిది దాటుతోంది...." తన విసుగును ప్రదర్శించాడు

" నన్నేమి చేయమంటావు ?? క్లయింట్ నాలుగు కి రమ్మంటే నువ్వు రెండు గంటలకి వెళ్ళలేవు కదా ??..తప్పదు ఏమి చేస్తాం " నేను తదేకంగా గమనించాను మా వాడి మనస్సులో ఎటువంటి కుట్రా కనపడటం లేదు .

" ఇట్లా అయితే నేను జాబ్ మానేస్తాను సార్ .....ఎంజాయ్ చెయ్యలేని జాబ్ వేస్ట్ అనిపిస్తోంది సార్ " ....అసహనం వ్యక్తం చేశాడు .

మా వాడు నా వైపు చూశాడు , నేను మా వాడి వైపు చూశాను .........మా వాడు మళ్ళీ అతని తో అన్నాడు

" బాబు ఏ కంపెనీ లో నైనా ఇట్లానే ఉంటుంది , కష్ట పడటం అంటే ఏమిటనుకున్నావు ??" నిజం గా మా వాడు నచ్చ చెప్పే ప్రయత్నమే చేస్తున్నాడు ( అంటే ఈ కథానాయకుడు కనుక మానేస్తే మళ్ళా కొత్త రిక్రూట్మెంట్ అయ్యేదాకా మా వాడే ఆ పని చేసుకోవాలి అన్న టెన్షన్ తో మాత్రం కాదు ) .....ఇంతలో మావాడి ఫోన్ మళ్ళా మ్రోగింది .....

" ఆ చెప్పు .........."

"................................................................................................................................ .."

" చూస్తాను అని చెప్పాను కదా ???........."

"........................................................................................................................................................ "

" మళ్ళా మళ్ళా అదే చెప్తావే .... చూస్తాను అని చెప్పా కదా ......పెట్టెయి.. ఫోన్ ....పెట్టేయి ...." విసుగ్గా పెట్టేశాడు ... కధానాయకుడి వైపు తిరిగాడు .." బయల్దేరు ...మళ్ళా లేట్ అవుతుంది ........" లేచి ఆఫీస్ వైపు అడుగులేస్తున్నాము.

" మరీ అట్నించి అటు ఇంటికి వెళ్ళి పోతాను సార్ ......", నిశ్చయంగా చెప్పేశాడు

అందుకే నేను ఆపు కోలేక ఉండబట్టలేక అడిగేశాను " ఏమోయ్ నీకు పెళ్లి అయ్యిందా .....??" ....... మావాడు నా కళ్ళలోకి చూసాడు దాదాపు పదిహేనేళ్ళ స్నేహం కదూ . ఒక విలక్షణ మైన నవ్వు తోణికిస లాడింది మా వాడి కళ్ళలో. అల్లరిగా నవ్వుకున్నాం ఇద్దరం. అయితే మా వాడు బాస్ కదా

" సరే ఈ రోజు కి వెళ్ళు , మళ్ళా ఇట్లా నన్ను అడగొద్దు ......" అంటూ తేలిక పడ్డ మనస్సు తో. పిల్లాడు కూడా సంతోషించాడు " ఓకే సార్ ...." అని మాతో పాటు ఆఫీసు వైపు వచ్చాడు . మధ్యలో ఏమి ఆలోచన వచ్చిందో ఏమో నన్ను అడిగాడు ......." నా పెళ్లి గురించి ఎందుకు అడిగారు సార్ ....." సందేహా(లావు .....

" ముందు ముందు నీకే తెలుస్తుంది లేవయ్యా .... వెళ్ళు " హడావిడి పెట్టాడు మా వాడు ......

..............ఏవండీ మీకు అర్ధమైంది గా నేను ఎందుకు అడిగానో ..... మా కధానాయకుడు మీకు కనిపిస్తే కొంచెం వివరించండి ....పెళ్ళైన మొగవాళ్ళ మైన మనందరి బాధ్యత ఇది...... ఏమంటారు ????

COMMENTS